ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన నీలవేణి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కౌటాల మండలంలోని కనికి గ్రామానికి చెందిన నీలవేణి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో 46,769 ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం ఆమె సిరిసిల్లలోని ఎస్ఆర్ఆర్ఎస్ ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసిస్తోంది.

**ప్రశ్న:** పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ర్యాంక్ సాధించడం ఎలా అనిపిస్తోంది..?

**జవాబు:** చాలా సంతోషంగా ఉంది. ఫలితాలు వచ్చిన వెంటనే ఈ శుభవార్తను మొదటగా మా నాన్న లక్ష్మణ్ కు చెప్పాను.

**ప్రశ్న:** ఈ విజయానికి కారణం ఎవరు..?

**జవాబు:** నా తల్లిదండ్రులు రేణుక, లక్ష్మణ్ ప్రోత్సాహం, అలాగే జన భవిత చారిటబుల్ ట్రస్ట్ అందించిన ఉచిత కోచింగ్ ఈ విజయానికి ప్రధాన కారణం.

**ప్రశ్న:** పరీక్షకు ఎలా సిద్ధమయ్యారు..?

**జవాబు:** ప్రతిరోజూ సుమారు 6 గంటల పాటు చదివాను. లక్ష్యంపై దృష్టి పెట్టి కష్టపడ్డాను.

**ప్రశ్న:** పరీక్షలో ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు..?

**జవాబు:** మొత్తం 160 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను.

**ప్రశ్న:** ఏ బ్రాంచ్లో చేరాలని అనుకుంటున్నారు..?

**జవాబు:** డీటీఎఫ్ బ్రాంచ్లో చేరాలని అనుకుంటున్నాను.

**ప్రశ్న:** మీ భవిష్యత్తు లక్ష్యం ఏమిటి..?

**జవాబు:** ఫ్యాషన్ డిజైనర్గా ఎదిగి మంచి గుర్తింపు పొందాలనుకుంటున్నాను.

**ప్రశ్న:** చదువుతో పాటు మీ హాబీలు ఏమిటి..?

**జవాబు:** ఇంటి పనుల్లో అమ్మకు సహాయం చేయడం, పుస్తకాలు, వార్తా పత్రికలు చదవడం, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవడం నాకు ఇష్టం.

**ప్రశ్న:** ఇతర విద్యార్థులకు మీరు చెప్పదలచుకున్న సందేశం ఏమిటి..?

**జవాబు:** ఆర్థిక ఇబ్బందులు ఉన్న విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య మంచి అవకాశం. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో పాటు మూడు సంవత్సరాల తర్వాత మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ సందర్భంగా నీలవేణి తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, జన భవిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జాడే చంద్రశేఖర్, ట్రస్ట్ అధ్యక్షులు డోంగ్రే సురేష్, అలాగే తనకు మార్గదర్శకత్వం అందించిన అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గురుకులంలో సీటు సాధించిన ధనలక్ష్మి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కౌటల గ్రామానికి చెందిన ధనలక్ష్మి గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి 5వ తరగతి ప్రవేశానికి సీటు సాధించింది. ఆమె ప్రస్తుతం మయూరి విద్యాలయంలో 4వ తరగతి చదువుతోంది. గురుకుల ప్రవేశ పరీక్షకు జన భవతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందింది.

**ప్రశ్న:** గురుకులంలో సీటు సాధించడం ఎలా అనిపిస్తోంది..?

**జవాబు:** చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నన్ను ప్రోత్సహించిన ప్రతిఒక్కరూ ఆనందించారు.

**ప్రశ్న:** ఈ విజయానికి కారణం ఎవరు..?

**జవాబు:** నా తల్లిదండ్రులు అఖిలా, సాయిబాబా. మయూరి విద్యాలయ ఉపాధ్యాయులు, జన భవతి చారిటబుల్ ట్రస్ట్లో అందించిన కోచింగ్, డోంగ్రి సురేష్ ప్రత్యేక మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రధాన కారణం.

**ప్రశ్న:** పరీక్షకు ఎలా సిద్ధమయ్యారు..?

**జవాబు:** ప్రతిరోజూ నాలుగు గంటల పాటు చదువుతూ, కోచింగ్లో నేర్పిన అంశాలను క్రమం తప్పకుండా అభ్యసించాను. డోంగ్రి సురేష్ చదువులో నాకు ఎంతో సహాయం చేసి, సందేహాలను నివృత్తి చేస్తూ ప్రోత్సహించారు.

**ప్రశ్న:** మీ భవిష్యత్తు లక్ష్యం ఏమిటి..?

**జవాబు:** భవిష్యత్తులో ఐపీఎస్ అధికారి అయి సమాజానికి సేవ చేయాలనుకుంటున్నాను.ఈ సందర్భంగా ధనలక్ష్మి తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులు అఖిలా, సాయిబాబా, జన భవితి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జాడే చంద్రశేఖర్ అధ్యక్షుడు డోంగ్రి సురేష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల ప్రవేశ పరీక్షలో సీటు సాధించడం పట్ల గ్రామస్థులు, ట్రస్ట్ యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలో విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.1.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మండల తహశీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీఓ శ్రీనివాస్, ఆర్సీఓ బాల భాస్కర్, సర్పంచ్ ముడిమడుగుల సురేష్తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను సకాలంలో అందజేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్నగర్ ప్రాంతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్ష నిధులతో రూ.13.50 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ కమిషనర్ రమేష్, చైర్పర్సన్ దావ స్వాతి, మండల విద్యాధికారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ రోడ్డు నిర్మాణానికి రూ.6.50 కోట్ల మంజూరు

- ప్రొసీడింగ్ ఆర్డర్ స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చెన్నూర్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్కు అనుసంధానంగా రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.6.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ ఆర్డర్ను శుక్రవారం హైదరాబాద్ ఎర్రమంజిల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్వీకరించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ప్రధాన ఇంజనీర్ జోగారెడ్డి, ఖమ్మం జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ఆర్డర్ కాపీని ఎమ్మెల్యేకు అందజేశారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్కు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఈ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు అత్యాధునిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఇలాంటి ప్రాజెక్టులను అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడం హర్షణీయమని అన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 24వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం, సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం దురదృష్టకరమని కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షా శిబిరాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఆర్.త్రివేణి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బోర్కుట్ రాజేందర్ సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులకు తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య హక్కు ఉందని పేర్కొన్నారు. గుర్తింపు సంఘ ఎన్నికలను నిరవధికంగా వాయిదా వేయడం కార్మికుల హక్కులను హరించడమేనని అన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, గుర్తింపు సంఘ ఎన్నికలను నిర్వహించేందుకు యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన భోలేనాథ్కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్మీ ఉద్యోగ నియామక ఫలితాల్లో గుడిహత్నూర్ గ్రామానికి చెందిన కత్తెవార్ భోలేనాథ్ ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా గుడిహత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడే శీలా, ఆమె భర్త పీఎస్హెచ్ఎం ఆడే రాజేశ్వర్ ఆధ్వర్యంలో భోలేనాథ్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకుడికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకుడు దేశ సేవకు ఎంపిక కావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. కష్టపడి చదివి ప్రతిభ కనబర్చి ఆర్మీ ఉద్యోగం సాధించడం అభినందనీయమని కొనియాడారు. భోలేనాథ్ సాధించిన విజయం గ్రామ యువతకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో దేశ రక్షణలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మద్దిబోయిన అర్జున్



**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తాండూర్ మండలానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు మద్దిబోయిన అర్జున్ను నియమిస్తూ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా టీయూవీ నాయకత్వం మాట్లాడుతూ జిల్లాలో నిజమైన ఉద్యమకారులను గుర్తించి, ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు కోసం నిరంతరం పోరాడాలని సూచించింది. నియామకంపై స్పందించిన మద్దిబోయిన అర్జున్ తనను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించిన టీయూవీ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ శంకర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోగర్ల రాజేశం, మండల అధ్యక్షుడు నిరంజన్లకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ నాయకత్వం సూచించిన మేరకు జిల్లాలోని నిజమైన ఉద్యమకారుల సమస్యలను గుర్తించి, వారికి ప్రభుత్వం ప్రకటించిన హామీలు అమలయ్యేవరకు పోరాటం కొనసాగిస్తానని అన్నారు. ఆయన నియామకంపై పలువురు ఉద్యమకారులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# జలగం వెంగళరావుకు ఘన నివాళులు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం వేంసూర్ మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల స్వామిరెడ్డి పాల్గొని జలగం వెంగళరావు రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన పాలనలో రాష్ట్ర అభివృద్ధికి పునాదులు పడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మపాలెం సర్పంచ్ పెద్దగౌండ్ల ప్రసన్న ధర్మారావు, ఉప సర్పంచ్ చెన్నారెడ్డి, నాయకులు పుచ్చకాయల కాంతారెడ్డి, బుడగనబోయిన సత్యం, లోకా కృష్ణ, రేసు వెంకటేశ్వరరావు, నందిగం రాంబాబు, బెజవాడ వెంకటేశ్వరరావు, బుడగనబోయిన పుల్లారావు, బుడగనబోయిన వెంకటేశ్వరరావు, గ్రామానికి చెందిన పలువురు మహిళలు హాజరై జలగం వెంగళరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఆసిఫాబాద్లో విద్యుత్ సామగ్రి దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

## రిమాండ్కు తరలింపు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలో ప్రభుత్వ విద్యుదీకరణ పనుల కోసం నిల్వ ఉంచిన రూ. 90,000 విలువైన విద్యుత్ సామగ్రిని దొంగిలించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.పోలీసుల కథనం ప్రకారం ఆసిఫాబాద్ బైపాస్ రోడ్, శివాజీ విగ్రహం సమీపంలో నివసించే డీఏ-జీ జీయూఏ కాంట్రాక్ట్ ఉద్యోగి పాములపాటి రవిచందర్ గిరిజన సంక్షేమ విద్యుదీకరణ కార్యక్రమం నిమిత్తం కొటారి కమలాకర్ ఇంటి ప్రహరీలో విద్యుత్ సామగ్రిని భద్రపరిచారు. అందులోని 6 బండిళ్ల 55 స్క్వేర్ కండక్టర్లు, 5 బండిళ్ల 34 స్క్వేర్ కండక్టర్లు, 80 సింగిల్ ఫేజ్ ఎక్స్-ఆర్మ్స్, 40 11కేవీ టాప్ సపోర్ట్స్, మరియు సుమారు 2 కిలోమీటర్ల పొడవైన 4 బండిళ్ల ఎల్.టి. సర్వీస్ వైర్లు దొంగతనానికి గురయ్యాయి. దీనిపై రవిచందర్ ఈ నెల 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించగా, తుంపల్లి గ్రామానికి చెందిన అనుముల ప్రమోద్ ఈ దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించిన పోలీసులు, చివరకు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో నిందితుడిని శుక్రవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించారు.ఈ సందర్భంగా ఆసిఫాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి. బాలాజీ వర ప్రసాద్ మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, వ్యాపారస్థులు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు మరియు గోదాముల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే లేదా అసాధారణ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# పాలిటెక్నిక్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం





- **జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయోత్సవం**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** గ్రామీణ విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందిస్తూ ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తున్న జన భవిత చారిటబుల్ ట్రస్ట్, అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కోచింగ్ కార్యక్రమం విశేష ఫలితాలను సాధిం చింది. మొత్తం 16 మంది విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో ఉచిత సీట్లు సాధించి ప్రతిభ చాటారు. వీరిలో 8 మంది విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో, ఇద్దరు సీఓఈలో, 6 మంది రెసిడె న్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత సాధించి ఉచిత సీట్లు పొందారు. ఈ సందర్భంగా జేబీసీటీ వ్యవస్థాపకులు ఝాడే చంద్రశేఖర్, ట్రస్ట్ అధ్యక్షులు డోంగ్రే సురేష్, వారి బృందం విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడ్వకేట్ కిశోర్ కుమార్, గోద్రేజ్ కంపెనీ జనరల్ మేనేజర్ వైభవ్, కౌటాల సర్పంచ్ నక్క శంకర్, మాజీ ఎంపీపీ విశ్వనాథ్, కౌటాల ఎంఈవో నానాజీ, చింతల మానేపల్లి ఎంఈవో జైరాజ్ హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత కోచింగ్ అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న సంస్థల సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు తమ విజయాలతో ఇతరులకు ఆదర్శంగా నిలిచి మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అదేవిధంగా చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ప్రతిభావంతులైన విద్యార్థులు కందూరి గంగ, కందూరి గౌరులకు అడ్వకేట్ కిశోర్ కుమార్ నగదు సహాయం అందజేశారు. కౌటాల సర్పంచ్ నక్క శంకర్ కూడా వారికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం సీట్లు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభి నందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు నాయకం శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్, యోగ మాస్టర్లు వినోద్, విజయ్, ట్రస్ట్ సభ్యులు మహేందర్, జగన్, రోహిణి ప్రవీణ్ కుమార్, సోషల్ మీడియా సాయి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల తో గ్రామాల్లో పండుగ వాతావరణం

- **కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్**
- **బూతాయి గ్రామంలో వైభవంగా ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం**



**ఉద్యమ కెరటం, బజార్ హత్నూర్:** ఇందిరమ్మ ఇళ్ల తో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. బజార్ హత్నూర్ మండలంలోని బూతాయి గ్రామంలో స్థానిక సర్పంచ్ రజాక్తో కలిసి లబ్ధిదారుడు రఫిక్ నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడు సొంతింటిలో ఆత్మగౌరవం, సుఖసంతోషాలతో జీవించా లనేదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. బోథ్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక మంది పేదల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నివాస సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోం దన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తవడంతో లబ్ధిదారులు ఆనం దోత్సాహాల మధ్య గృహ ప్రవేశాలు నిర్వహించుకుంటు న్నారని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, నాయకులు జల్కె పాండురంగ్, చిలుకూరి భూమయ్య, కళ్లెం విఠల్, శివుడు, బత్తిని కిషన్, గణేష్, దేవేందర్, విజేందర్, వివిధ గ్రామాల మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంగా శిక్షణ

- **కాగజ్నగర్ మున్సిపల్ వైస్ చైర్పర్సన్ డా. కొత్తపల్లి అనిత**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే లక్ష్యంగా కొమురం భీం జిల్లా కాగజ్నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియాలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి – చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్పర్సన్ డా. కొత్తపల్లి అనిత ప్రముఖ వైద్యులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని, తమ కాళ్ల మీద తాము నిలబడేలా ఉపాధి అవకాశాలు కల్పించాలనే సత్సంక ల్పంతోనే ఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిం చినట్లు తెలిపారు. ప్రతి బ్యాచ్కు రెండు నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజే స్తామని వెల్లడించారు. స్థానిక మహిళలు, యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు.సమాజ సేవలో నిరంతరం ముందుంటూ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. అందుబాటులో వైద్యసేవలు అందించడం, విద్యా అభివృద్ధికి తోడ్పాటునందించడం, ఉపాధి కల్పన చేపట్టడం, పర్యావరణాన్ని పరిరక్షించడం మరియు ఆధ్యాత్మిక చింతనతో పాటు ధర్మ రక్షణ చేయడం వంటి ఐదు ముఖ్య లక్ష్యాలతో ప్రజలకు సేవలు అందిస్తు న్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందే మహిళలు, సొసైటీ సభ్యులు పాల్గొ న్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీ త గడువులోగా పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను నిర్ణీ త గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎమ్. డేవిడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన, కంప్యూటర్ డేటా ఎంట్రీ, నమోదు మరియు శిక్షణ కార్యక్రమంపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి మరియు మండల స్థాయిలో ప్రజావాణి ద్వారా వచ్చే దరఖా స్తులను ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. బాధితులకు అర్థమయ్యే రీతిలో, సత్వరమే వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రజావాణి దరఖాస్తుల నమోదు ప్రక్రియ మరియు ప్రగతిని పీపీటీ ద్వారా ఈ సమావేశంలో వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు , ఎంపీడీఓలు , సెక్షన్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు , ఈడీఎం కలెక్టరేట్ సిబ్బంది పాల్గొ న్నారు.

# జులై 31న కుమ్రం భీం పోరుగడ్డ లో 'తుడుందెబ్బ' భారీ బహిరంగ సభ

- **లక్ష మందితో సభను విజయవంతం చేస్తాం: జాతీయ అధ్యక్షుడు కొట్నాక విజయ్, రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్ కుమార్**
- **ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు, పోడు భూముల సమస్యలపై పోరాటం ఉధృతం**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జులై 31న కుమ్రం భీం పోరుగడ్డలో 'తుడుందెబ్బ' భారీ బహిరంగ సభ లక్ష మందితో సభను విజయవంతం చేస్తాం: జాతీయ అధ్యక్షుడు కొట్నాక విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గొండ్వానా రాయి సెంటర్ జిల్లా కార్యాలయంలో తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం, గొండ్వానా రాయి సెంటర్ రాజ్ గోండు సేవ సమితి అత్యవసర సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కొట్నాక విజయ్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లా డుతూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 సవరణ జరగకుండానే లంబాడీలు అక్రమంగా ఎస్టీ జాబితాలోకి చేరి నేటికి 50 ఏళ్లు పూర్తవుతోందని ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీల విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల దోపిడీ జరుగుతోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ అక్రమ లంబాడీ వలసలపై జుడీషియల్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఐటీడీఏల ద్వారానే షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాలను భర్తీ చేయాలని వారు కోరారు. TSPSC, పోలీస్ బోర్డు, మెడికల్ బోర్డుల ద్వారా నోటిఫికేషన్లు వస్తున్న ప్పటికీ, ఏజెన్సీ పరిధిలోని 22 శాఖల్లో గల 155 రకాల ఉద్యోగాలను ఏజెన్సీ సర్టిఫికెట్ ద్వారా స్థానిక ఆదివాసీలకే దక్కేలా చేయాలన్నారు. కానీ, ప్రస్తుతం ప్రభుత్వం 'జీవో 317' పేరిట నూతన జోనల్ విధానాన్ని తీసుకువచ్చి ఏజెన్సీ ఉద్యోగాలను కొల్లగొడుతోందని ధ్వజమెత్తారు. అలాగే, రాష్ట్రంలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా, వారిని అడవికి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 3న మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడ మండలంలో 'తుడుందెబ్బ ఆదివాసీ పోరు కేక' బహిరంగ సభను నిర్వహించామని గుర్తు చేశారు. జూన్ 30 లోపు రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో జులై 1 నుండి డిసెంబర్ 30 వరకు 6 నెలల పాటు ఉధృత ఉద్యమ కార్యాచరణను తుడుందెబ్బ రూపకల్పన చేసిందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే జులై 31న కుమ్రం భీం పోరుగడ్డలో లక్ష మందితో భారీ బహిరంగ సభను నిర్వ హించనున్నట్లు వెల్ల డించారు.జూన్ 30న హైదరాబాద్లో వివిధ సామాజిక కులాలతో లంబాడీల వలసలపై విస్తృత చర్చ ఉంటుందని, ఈ సభ విజయవంతం కోసం యూనివర్సిటీ విద్యార్థులు సైతం రంగంలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో రాజ్ గోండు సేవ సమితి జిల్లా అధ్యక్షుడు మడవి శ్రీనివాస్, జిల్లా సార్ మేడి అధ్యక్షుడు కుర్సింఘా మోతీరామ్, తుడుందెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆడ జంగు తదితరులు పాల్గొ న్నారు.

# కల్లూ రు మున్సిపాలిటీ కమిషనర్గా సాయి కృష్ణా రెడ్డి బాధ్యతల స్వీకరణ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఖమ్మం జిల్లా కల్లూ రు మున్సిపాలిటీ నూతన కమిషనర్గా సాయి కృష్ణా రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సాయి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొ న్నారు.

# ఆదర్శ మార్కెట్గా తీర్చిదిద్దుతాం

**మార్కెట్ కమిటీ చైర్మన్ భోరంచ్ శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రైతు సంక్షేమమే ధ్యేయంగా అదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును జిల్లాలోనే ఆదర్శవంతమైన మార్కెట్గా తీర్చిదిద్దుతామని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ భోరంచ్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డులో నూతన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షత వహించగా, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ భోరంచ్ శ్రీకాంత్ రెడ్డి మాట్లా డుతూ మార్కెట్లో పారదర్శక పాలన అందిస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు మెరుగైన సేవలు, మార్కెట్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. అధికారులు, డైరెక్టర్లు అందరూ సమన్వయంతో పనిచేసి మార్కెట్ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ మాట్లాడుతూ నూతన కమిటీ నేతృత్వంలో మార్కెట్ యార్డు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం కోసం తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ అధికారులు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొ న్నారు.

# మతాలకు అతీతంగా గుడి నిర్మాణానికి ఆర్థిక సహాయం

- **బీరయ్య గుడి నిర్మాణానికి రూ.5 వేల సహాయం చేసిన మహ్మద్ ఈసా**



**ఉద్యమ కెరటం, తాండూర్:** మతాలు వేరైనా మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయ తలకు హద్దులు ఉండవని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఈసా నిరూపించారు. తాండూర్ మండలం కొత్తపల్లిలో గ్రామంలోని కుర్మ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరయ్య గుడి నిర్మాణానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం కొత్తపల్లి గ్రామంలో ఈ విరాళాన్ని కుర్మ కుల పెద్దలు సిర్రం పర్వాతలు, అన్నం మల్లేష్లకు అందజేశారు. హిందూ ముస్లిం అనే భేదాలు లేకుండా గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఈసా పేర్కొన్నారు. గుడి నిర్మాణానికి ముస్లిం నాయకుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, మత సామర స్యానికి బలమైన సందేశాన్ని ఇస్తాయని అభిప్రాయపడ్డారు. గ్రామంలో సోదరభావం, పరస్పర గౌరవం కొనసాగేందుకు ఇలాంటి సహకారాలు మరింత ప్రేరణగా నిలుస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు.

## స్వయం ఉపాధికి ధాబాలు దోహదం

• కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** స్వయం ఉపాధికి ధాబాలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాబాను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలతో పాటు జాతీయ రహదారి గుండా ప్రయాణించే వారికి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో ఈ ధాబా కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వ్యాపార సంస్థలు ఏర్పడడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ధాబా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపారం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడే శీల, ఉప సర్పంచ్ నిఖిల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లాంధాడే నాగనాథ్ అప్ప, ససానే మాధవ్, ఎంఐఎం మండల అధ్యక్షుడు అర్షద్ ఖురేషి, హుస్సేన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముందే గణేష్, వార్డు సభ్యులు మహమూద్, రాజు తెలంగే, యూపీఏ మంకాపూర్ సుశీల్, ఆడే క్రాంతికుమార్, ఆడే జయపాల్, పవార్ ప్రకాష్, సమీర్ ఉల్లా ఖాన్, అనిల్, లక్ష్మణ్ బాలేరావు తదితరులు పాల్గొన్నారు.

## జైనూర్ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి

• వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 40 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి, పూర్తి స్థాయి వైద్య సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలు, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరారు. శుక్రవారం హైదరాబాద్లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జైనూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి, కెరమెరి, నార్నూర్ మండలాల ఆదివాసీ ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా సేవలందిస్తోందని తెలిపారు. ఈ ఆసుపత్రిలో పడకలు, వైద్యులు, నర్సులు, అవసరమైన వైద్య పరికరాల కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, అత్యవసర వైద్య సేవల విషయంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిని 40 పడకాల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేసి అన్ని వసతులు కల్పించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జైనూర్ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో ఆదివాసీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## తహశీల్దార్ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**ఉద్యమ కెరటం, సొనాల:** సొనాల మండల తహశీల్దార్ అంకుల్ల మల్లేష్ మాతృమూర్తి అంకుల్ల ఆశమ్మ ఇటీవల మృతిచెందారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మావల గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ మల్లేష్తో పాటు కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆశమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబానికి భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో డీసీసీ కార్యదర్శి చౌహాన్ హరి సింగ్, ఏఎంసీ డైరెక్టర్లు మునేశ్వర్ సోమన్న, బోథ్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జుంగాల భోజన్న, కాంగ్రెస్ నాయకులు గోండ్ల భోజరాజు, భాట్య కైలాస్ సేఠ్ తదితరులు ఉన్నారు.

# సీసీఐ కూల్చివేత అక్రమం, అన్యాయం

• బీజేపీ హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది
• డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సీసీఐ కూల్చివేత అక్రమం, అన్యాయమని, బీజేపీ హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ నాయకులు ఇప్పుడు దానిని శాశ్వతంగా తుక్కుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఐ కర్మాగారం జిల్లాలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. అయితే బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు పునరుద్ధరణ హామీలతో ప్రజల మద్దతు పొంది, ఇప్పుడు కర్మాగారం కూల్చివేతకు సహకరిస్తున్నారని విమర్శించారు. స్థానిక మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.5 కోట్ల బకాయిలు, విద్యుత్ శాఖకు రూ.20 కోట్ల బిల్లులు, అర్లి గ్రామపంచాయతీకి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా సీసీఐ స్క్రాప్ టెండర్లు పిలిచి కూల్చివేత పనులు ప్రారంభించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. స్థానిక సంస్థలను, చట్టాలను గౌరవించకుండా చేపడుతున్న ఈ చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పరమేశ్వర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖిజార్ పాషా, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కిల్స్ సెంటర్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కే హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణను అందించి, వారి భవిష్యత్తుకు తోడ్పడేలా నిర్మిస్తున్న 'స్కిల్స్ సెంటర్' భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారంజిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో పాత కలెక్టరేట్ భవనం వెనుక భాగంలో రూ. 70 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న స్కిల్స్ సెంటర్ భవన నిర్మాణ పనులను జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ధర్మేందర్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో భాగంగా రూ. 70 లక్షల నిధులతో ఈ స్కిల్స్ సెంటర్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ అందుబాటులోకి రావడం వల్ల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ అందించి, వారు స్వయం ఉపాధి పొందేందుకు సొంతంగా ఎదిగేందుకు గొప్ప అవకాశం లభిస్తుందని అన్నారు.భవన నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పెండింగ్ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి, భవనాన్ని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పి.ఆర్. ఈఈ ధర్మేందర్, జిల్లా సమన్వయకర్త సాంబశివరావు, ఏఈ గోపాల్, టాస్క్ జిల్లా మేనేజర్ రాకేష్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రుయ్యాడి–ఉమ్మడం రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం

• కలెక్టర్ రాజార్షిషా తక్షణ స్పందనపై గ్రామస్తుల హర్షం



**ఉద్యమ కెరటం, తలమడుగు:** మొహర్రం పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రుయ్యాడి నుంచి ఉమ్మడం వరకు దెబ్బతిన్న రహదారి మరమ్మతు పనులను శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఉదుగు రాకేష్ కలిసి పనులకు శ్రీకారం చుట్టా రు.మొహర్రం పండుగ సందర్భంగా ఈ ప్రాంతానికి వేలాది మంది భక్తులు తరలివస్తుండటంతో రహదారి అధ్వాన పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్ రెడ్డి, గ్రామస్థులు ఇటీవల ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజార్షిషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజల సమస్య తీవ్రతను, పండుగ ప్రాముఖ్యతను గుర్తించిన కలెక్టర్ వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతుల కోసం రూ.3లక్షల నిధులు మంజూరు చేశారు. తమ విజ్ఞప్తిపై తక్షణ చర్యలు తీసుకున్న కలెక్టర్కు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎన్.అశోక్, ఎస్.రమాకాంత్, జె.ఉత్తమ్, మార్కెట్ డైరెక్టర్ ఈ.దివాకర్, నాయకులు టి.గంగారెడ్డి, ఎన్.గంగాధర్, ఎల్.ప్రవీణ్ రెడ్డి, జి.సాంబశివ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయికిరణ్, మాజీ సర్పంచ్ వెంకన్న, బాలాజీ, పందరి, కిష్టన్న, మోహన్, భీమన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్పై రైతులు అవగాహన పెంపొందించుకోవాలి

• మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు



**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రభుత్వ నిర్ణీత ధరకే రైతులకు ఎరువులు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన యూరియా యాప్పై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు సూచించారు. శుక్రవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూరియా పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు యూరియాను విక్రయించి రైతులను నష్టపరిచేవారని గుర్తు చేశారు. యూరియా యాప్ ద్వారా ఎరువులు బ్లాక్ మార్కెట్కు తరలిపోకుండా నియంత్రించడంతో పాటు, దుకాణాల్లో రోజువారీగా ఉన్న నిల్వల వివరాలను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తమ పట్టా పాసుపుస్తకాలను ఇతరులకు ఇవ్వకుండా జాగ్రత్తపడాలని, దళారుల చేతికి అవి చేరితే యాప్లో స్లాట్లు బుక్ చేసి యూరియాను పక్కదారి పట్టించే ప్రమాదం ఉందని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ కేంద్రే శివాజీ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పెందూర్ గణపత్, సర్పంచ్ విజయలక్ష్మి బీర్షా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆత్రం నాగోరావు, సీఈఓ కనక రమేష్, అర్జున్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టు బడి ఉంది





• విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందిస్తాం
• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలో విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.1.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, తహశీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీఓ శ్రీనివాస్, ఆర్సీఓ బాల భాస్కర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం సృష్టిస్తున్నామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేస్తున్నామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నామని వివరించారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్నగర్ ప్రాంతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.13.50 లక్షల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి, మండల విద్యాధికారి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభానికే పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

